



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం, మార్చి 20, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన

## ఈ 3 అంశాలే మా ఎజెండా

**3,04,965 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి.. గత పాలన సవాళ్లకు.. మా పాలన సత్తాతోనే సమాధానం**

**విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా రాష్ట్రాన్ని మారుస్తున్నాం .. యావత్ దేశానికే తలమానికంగా నిలిచేలా సాగుతున్నాం**

**అంబేడ్కర్ నొక్కి చెప్పిన రాజ్యాంగ నైతిక విలువలనే పాటిస్తున్నాం .. అవాస్తవ ప్రచారాలు చేయడమే కొందరి పని**

**ఆ కుట్రను సమర్థంగా తిప్పికొడుతూ ముందుకు సాగుతున్నామని భట్టి వెల్లడి.. ఇది చరిత్రాత్మక ప్రజా బడ్జెట్..: సీఎం రేవంత్**

హైదరాబాద్: అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. తమ ప్రాథమ్యాలని, ఈ మూడు అంశాలతో కూడిన తమ పాలన నమూనా యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా ముందుకు సాగుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల కారణంగా.. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలన పర్యవసానాలను మార్చుకునేందుకు కొంత ఇబ్బంది ఎదురైందని, అయినా 'చేతి'లో ఉన్న మిగతా కాలంలో పాలనను పరుగుపెట్టిస్తామని చెప్పారు. "రాష్ట్రం పురోగమించేందుకు వేస్తున్న అడుగుల్లో మాకు ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. గత పాలకులు సృష్టించిన సవాళ్లన్నింటినీ సమర్థంగా ఎదుర్కొంటూ మా పాలన సత్తా చాటుతున్నాం. విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా రాష్ట్రాన్ని మారుస్తున్నాం. తెలంగాణ రైజింగ్%-%2050 ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం.." అని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం 200 బిలియన్ డాలర్లు అని.. పదేళ్లలో దీనిని వెయ్యి బిలియన్ డాలర్ (ట్రిలియన్ డాలర్) వ్యవస్థగా మార్చే దిశలో సాగుతున్నామని తెలిపారు. భట్టి విక్రమార్క బుధవారం 2025%-%26 ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌ను రూ.3,04,965 కోట్ల అంచనాలతో అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగెత్తించే కార్యాచరణతో ముందుకొచ్చామ ని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం భట్టి మాటల్లోనే.. "ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా, పారదర్శకత, జవాబుదారీతనంతో సాగుతున్న మా ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలనా రథాన్ని పరుగులు పెట్టించడంలో సఫలీకృతం అయ్యాం. 'భారతదేశాన్ని ఒక రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం అమలు చేసే పటిష్టమైన ప్రజాస్వామ్య దేశంగా చూడాలనుకుంటున్నా'అని నాడు అంబేడ్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగ నైతికతను పదే పదే నొక్కిచెప్పారు. ఆ నైతిక విలువలనే

మిగతా 2లో





## ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్

# మధ్య కీలక ఒప్పందం

### చంద్రబాబును ప్రశంసించిన బిల్ గేట్స్

ఢిల్లీలో సీఎం చంద్రబాబు పర్యటన

నేడు బిల్ గేట్స్ తో కీలక సమావేశం

కీలక రంగాల్లో సహకారంపై లోతైన చర్చ

ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరువర్గాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఆరోగ్య సంరక్షణ, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయం వంటి కీలక రంగాలలో తక్కువ ఖర్చుతో కూడుకున్న, విస్తరించదగిన పరిష్కారాలను అనుసంధానించడం ద్వారా ప్రజల సంక్షేమం కోసం సాంకేతికతను ఉపయోగించడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రాభివృద్ధి దిశగా ఇరువురు అనేక అంశాలపై లోతైన చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఒప్పందంపై

మిగతా 2లో



# పాక్‌కు రక్షణ సమాచారం చేరవేత

### కాన్పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్ట్

లక్నో: పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐకు దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై కాన్పుర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగిని ఉత్తర్‌ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్ట్ చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూనియర్ వర్క్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ వికాస్ పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్‌తో కలిసి కుట్ర పన్నుతున్న ట్లు- సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు- పేర్కొన్నారు. 2025 జనవరిలో ఓ మహిళా పాకిస్థాన్ ఏజెంట్‌తో అతడికి ఫేస్‌బుక్‌లో పరిచయం అయ్యిందని.. ఆమె తనను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (ఇఐఊర)లో ఉద్యోగం చేసే నేహాశర్మగా పరిచయం చేసుకుందని అన్నారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధించిన సున్నితమైన విషయాలను అందించాలని..దానిని డబ్బులిస్తాని ముందు ఆశ చూపింది. అనంతరం అతడికి వలపు వల విసిరింది. దీంతో అతడు

మిగతా 2లో

# ఢిల్లీకి మూటలు మోసేలా బడ్జెట్

నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయింది

అంకెలు ఎందుకు ఆగమాయ్యాయో చెప్ప

బడ్జెట్‌పై ఘాటు విమర్శలు చేసిన కెటిఆర్ 2 లో






# పేదలవి కాదు.. పెద్దల ఇళ్లు కూల్చండి

2 లో

### హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం

# స్మితా సభర్వాల్‌కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం



హైదరాబాద్: తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులు తిరిగి యూనివర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనుంది. ఒకటి రెండు రోజుల్లో ఆమెకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో సీఎంఓలో అదనపు కార్యదర్శి హెూదాలో ఉన్న స్మితా సభర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. నెలకు రూ.63 వేల చొప్పున అద్దె రూపంలో యూనివర్సిటీ

మిగతా 2లో

# బడ్జెట్ పేరుతో ప్రజలను దారుణంగా మోసం

### పొంతన లేని కేటాయింపులతో గారడీ

### 6 గ్యారంటీలకు పాతరేసేలా బడ్జెట్ రూపం

### కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ను పరిశీలిస్తే...డొల్ల అని తేలిపోయింది. ముఖ్యంగా గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని తేలిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా వెల్లడైందని, మొత్తంగా బడ్జెట్ తీరును విశ్లేషిస్తే... అబద్దాలు...అంకెల గారడీ...6 గ్యారంటీలకు పాతరేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందన్నారు బండి సంజయ్. ఓం భూం బుష్ అంటూ మాయ చేసేందుకే ప్రయత్నిస్తున్నట్లు- స్పష్టంగా కన్పిస్తోందన్నారు. అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్ ను సాధనంగా ఉపయోగించుకోవడం సిగ్గు చేటని ఆయన విమర్శించారు. పైగా 10 సార్లు చెబితే అబద్ధమే నిజమైతుందనే నానుడిని బడ్జెట్ లో ప్రస్తావించిన కాంగ్రెస్ ప్రభుత్వం.... అదే ఒరవడిని కొనసాగించడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు, ఆచరణకు ఏమాత్రం పొంతన లేని బడ్జెట్ ఇదని, 6 గ్యారంటీలను పూర్తిగా తుంగలో తొక్కేశారని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా పేర్కొన్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక చిత్తుకాగితంగా మార్చినట్లు- తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం భారీగా పెరిగినట్లు- బడ్జెట్ లో గొప్పలు చెప్పిన ప్రభుత్వం... అప్పుల వివరాలను కూడా బడ్జెట్ లో పొందుపరిచి ఒక్కో తెలంగాణ పౌరుడిపైనా, చివరకు

మిగతా 2లో



# అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన



పాటిస్తూ ప్రజాపాలన సాగిస్తున్నాం. దశాబ్దకాలం వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక అరాచకత్వంతో ఛిద్రమైన తెలంగాణ పాలనా, ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెడుతూ ముందుకు సాగుతున్నాం.

**స్వార్థపరుల అబద్ధపు ప్రచారం..**

నిజం కూడా ప్రతి రోజూ ప్రచారంలో ఉండాలి. లేదంటే అబద్ధమే నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది. ప్రభుత్వం చేసే ప్రతి చర్యను శంకిస్తూ, నిరాధార విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో, సొంత పత్రికలలో అబద్ధపు వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ కుట్రను సమర్థంగా తిప్పికొడుతూ, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచడం మా బాధ్యత. ప్రజలకు వాస్తవాలు చెప్పకపోతే.. ఆ స్వార్థపరులు ప్రచారం చేసే అబద్ధాలే నిజాలుగా భ్రమించే ప్రమాదం ఉంది.

**కేవలం కేటాయింపులకే పరిమితం కాదు..**

మేం బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదు. అవి సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. మా ప్రభుత్వం సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమ సమ్మిళిత విధానాలతో ప్రగతివైపు అడుగులు వేసేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. రైతులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దినసరి కూలీలు, ఐటీ నిపుణులు.. ఇలా ప్రతి ఒక్కరినీ ఈ పథకాలు బలోపేతం చేస్తాయి. సమష్టి కృషితో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**జాతీయ సగటు కంటే మన వృద్ధి రేటు ఎక్కువ**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొంటూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. 2024%-%25లో తెలంగాణ జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల ప్రకారం రూ.16,12,579 కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే 10.1 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఇదే సమయంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.9 శాతంగానే ఉంది. 2024%-%25లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751, వృద్ధిరేటు 9.6 శాతం అయితే.. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579, వృద్ధి రేటు 8.8 శాతం మాత్రమే. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,74,172 (1.8 రెట్లు) మేర ఎక్కువగా ఉంది.

**రాష్ట్ర పన్నుల వాటా 50శాతానికి పెంచాలని కోరాం**

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు న్యాయమైన భాగం దక్కాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘానికి సమర్పించిన సమగ్ర నివేదికలో కోరింది. కేంద్రం విధిస్తున్న సెస్సులు, అదనపు చార్జీల వల్ల రాష్ట్రాలకు వస్తున్న ఆదాయం గణనీయంగా తగ్గుతోందని రాష్ట్రం తరఫున వివరించాం. ప్రస్తుతం రాష్ట్రాలకు ఇస్తున్న 41శాతం పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలని కోరాం. తెలంగాణకు 14వ ఆర్థిక సంఘం ద్వారా 2.437 శాతం నిధుల పంపిణీ జరిగితే.. 15వ ఆర్థిక సంఘం కాలంలో 2.102 శాతానికి తగ్గింది. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయం. దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా పన్నుల పంపిణీ విధానాన్ని హేతుబద్ధం చేయాలన్నది మా వాదన.

**ధరణి కష్టాలకు చెక్ పెట్టాం..**

భూమి కేవలం స్థిరాస్తి కాదు. ఒక భావోద్వేగం. భూమితో బంధం కన్నతల్లితో, సొంత ఊరితో ఉన్న అనుబంధంతో సమానం. గత ప్రభుత్వ హయాంలో ధరణి ప్రాజెక్టులో చోటు చేసుకున్న అక్రమాల వల్ల భూసంబంధిత సమస్యలు ప్రజలకు వేదన మిగిల్చాయి. ఆ సమస్యలకు చెక్ పెడుతూ మా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చింది. ఇందులో నిబంధనలు పారదర్శకంగా, సమగ్రంగా.. భూవివాదాలకు తావులేకుండా, భూ యజమానుల హక్కులు పూర్తిగా పరిరక్షించడానికి వీలుగా ఉన్నాయి.

**ఎన్నడూ లేని స్థాయిలో కులగణన**

అసమానతలను రూపుమాపే లక్ష్యంతో.. గతంలో ఎన్నడూ చేపట్టని విధంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. మొత్తం 1.12 కోట్ల కుటుంబాల వివరాలను సేకరించింది. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేందుకు, సమర్థవంతమైన పాలన కోసం ఈ సర్వే కీలక డేటా అందించింది. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల వారికి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అందించడానికి అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, సమగ్ర ఆర్థిక పురోగతి విధానాల రూపకల్పనకు ఇది ఆధారంగా మారనుంది.

**'ఫ్యూచర్'లో ఏఐ సిటీ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా 200 ఎకరాల్లో ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తాం. అది ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజ కంపెనీలకు కేంద్రంగా మారుతుంది. గూగుల్ కంపెనీ ఇక్కడ ఏఐ ఆధారిత యాక్సిలరేటర్ సెంటర్‌ను నెలకొల్పేందుకు సిద్ధంగా ఉంది" అని భట్టి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

**విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా..**

"గత దశాబ్దంలో ఎదుర్కొన్న ఎన్నో సవాళ్లను అధిగమించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో కొనసాగుతోంది. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటూ.. సుసంపన్నత, సమగ్రత, స్థిరమైన అభివృద్ధితో కూడిన తెలంగాణను నిర్మిస్తాం. ప్రతి పౌరుడికి విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రతను కల్పించే స్థాయికి ఈ రాష్ట్రాన్ని తీసుకువెళ్లడమే మా లక్ష్యం."

**ఇంటి దగ్గర గుడిలో పూజలు చేసి..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రి హోదాలో మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బుధవారం ఉదయం తమ ఇంటి దగ్గరున్న దేవాలయంలో భట్టి విక్రమార్క దంపతులు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అసెంబ్లీకి వచ్చిన భట్టికి ఆర్థిక శాఖ అధికారులు, శాసనసభ అధికారులు స్వాగతం పలికారు. తోటి మంత్రులతో కలసి అల్పాహార విందు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బడ్జెట్ పుస్తకాలున్న బ్యాగ్‌ను అందచేశారు. తర్వాత మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టడం కోసం శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు బడ్జెట్ ప్రతులను అందచేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు కూడా బడ్జెట్ ప్రతులతో కూడిన బ్యాగును అందించారు. ఈ క్రమంలో మంత్రి మండలి భేటీ అయి బడ్జెట్‌ను ఆమోదించింది. ఈ సందర్భంగా సహచర మంత్రులంతా భట్టిని అభినందించారు. కాగా.. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఏకంగా 14వ సారి బడ్జెట్ రూపకల్పనలో పాలు పంచుకోవడం విశేషం. ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆయన బడ్జెట్ రూపకల్పనలో భాగమవుతూ వచ్చారు.

## పేదలవి కాదు.. పెద్దల ఇళ్లు కూల్చండి

హైదరాబాద్: హైడ్రాపై తెలంగాణ హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేవలం పేదల ఇళ్లే కాకుండా పెద్దలవి కూడా కూల్చాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. పెద్దల భవనాలను కూల్చినప్పుడే ప్రభుత్వ భూములను రక్షించినట్లు అవుతుందని పేర్కొంది. మీరాలం ట్యాంకు పరిసరాల్లో ఇళ్ల యజమానులకు రాజేంద్రనగర్ తహసీల్దార్ ఇచ్చిన నోటీ-సులపై హైకోర్టులో పిటిషన్ చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం.. దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లోని ఆక్రమణలను ఎందుకు తొలగించడం లేదని హైడ్రాను ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. చెరువుల పరిరక్షణ మంచి విషయమే అయినా చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపింది. మీరాలం ట్యాంకు చెరువు పరిసరాల్లో నిర్మాణాలు ప్రభుత్వ స్థలంలో ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది.

## ఢిల్లీకి మూటలు మోసేలా బడ్జెట్

హైదరాబాద్: ఒక్క మాటలో ఈ బడ్జెట్ గురించి చెప్పాలంటే.. ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్‌లా ఉందని అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. నీ తెలివి తక్కువ తనం వల్ల, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల ఆదాయం తగ్గిపోయిందని సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నేరుగా విమర్శలు చేశారు.మీడియా ముందు రంకెలు వేయడం కాదు.. అంకెలు ఎందుకు ఆగమాయ్యాయో చెప్పు. గత బడ్జెట్ సందర్భంగా చెప్పినట్లు మీ బడ్జెట్ అంచనాలకు ఎందుకు చేరుకోలేకపోయింది. నమ్మి ఓట్లేసిన పాపానికి 4 కోట్ల మందిని ముంచిన బడ్జెట్ ఇది అంటూ విమర్శలు చేశారు.. పదేండ్ల ప్రగతి రథచక్రానికి పంక్చర్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డి అసమర్థతకు, చేతగానితనానికి నిలువుటద్దం ఈ బడ్జెట్. వీరి అసమర్థతత, చేతకాని తనం వల్ల ఆకాశం నుంచి పాతాళం వైపు ఆర్థిక వ్యవస్థ పోతున్నదంటే కచ్చితంగా బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. కేసీఆర్ ఏడాదికి రూ. 40 వేల కోట్ల అప్పు జేస్తే రంకెలు వేశారు. కానీ ఇవాళ ఒక్క ఏడాదికి లక్షా 60 వేల కోట్లు- అప్పు చేసి కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఒక్క ఇటు-క పేర్చలేదు. ఒక్క గ్యారెంటీ- కూడా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ బడ్జెట్‌ను చూస్తుంటే లక్షల కోట్ల అప్పు టార్గెట్ కనబడుతున్నట్టు- ఉందని కేటీ-ఆర్ పేర్కొన్నారు. తొండ ముదిరితే ఊరసవెల్లి అవుతదని పెద్దలు చెబుతారు. కానీ ఊరసవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అయితడని ఈబడ్జెట్ చూసిన తర్వాత అర్థమవుతుంది. సంక్షేమానికి సమాధి.. అభివృద్ధికి అడ్రస్ గల్లంతు.. ప్రజలకు ఇచ్చిన హామీలకు ఘోరీ కట్టి.. పార్టీ కార్యకర్తలకు మాత్రం వీళ్ల అబ్బ సొత్తు.. పప్పుబెల్లం లాగా 6 వేల కోట్లు- పంచి పెడుతారట.



## హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్ గ్లోబల్ ఆఫీస్

హైదరాబాద్: అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డోనాల్డ్‌తో తెలంగాణ ప్రభుత్వం తో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా మెక్ డోనాల్డ్ ఇండియా గ్లోబల్ ఆఫీస్ ను హైదరాబాద్ లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. త్వరలో 2,000 మంది ఉద్యోగులతో మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఇండియా ఆఫీసును నగరంలో ప్రారంభించనుంది. బుధవారం ఉదయం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెక్ డోనాల్డ్ ఛైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కితో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ గ్లోబల్ ఆఫీస్ ఏర్పాటు-కు సంబంధించి మెక్ డోనాల్డ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పెట్టు-బడుల ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా మెక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ హైదరాబాద్లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సెంటర్ తమ రాష్ట్రంలోనే స్థాపించాలని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న సందర్భంలో మెక్ డోనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టు-బడులకు గమ్యస్థానంగా ఎంచుకోవడం గర్వంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివరించారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ- సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ-ని స్కిల్ జోన్ గా ఉపయోగించుకుని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్ లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్ లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. మెక్ డోనాల్డ్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లాంటి ఇతర సిటీలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు- మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డోనాల్డ్ సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కి అన్నారు. అందుకే హైదరాబాద్ ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్ గా ఎంచుకున్నట్లు- చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డోనాల్డ్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ- అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. తదుపరి సంప్రదింపులు, ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలోనూ ఇటు-వంటి కార్యక్రమాలను చేపడుతామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్ డోనాల్డ్ ఔట్‌లెట్లు- ఉన్నాయి. ప్రతి ఏడాది మరో 3 లేదా 4 కొత్త ఔట్‌లెట్లను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయి.

## స్మితా సభర్వాల్‌కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం

నుంచి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. స్మితా సభర్వాల్ అద్దెకు తీసుకున్న టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో ప్లేట్ వాహనం కాదు. ప్రైవేటు వ్యక్తిగత వాహనం పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో వెల్లడైంది. సీఎంవో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో యూనివర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పనితీరుపై ఇటీవల ఏజీ జరిపిన విచారణలో కొన్ని తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు వెల్లడయ్యాయి. అందులో ఈ అంశం కూడా ఉంది. ఈ విషయంపై వివరణ కోరగా... స్మితా సభర్వాల్ వాహన అద్దెపై ఆడిట్ అభ్యంతరం నిజమేనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్దాస్ జానయ్య అన్నారు. ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ, విశ్లేషణ జరిపించామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి తీసుకురావడం ద్వారా సమావేశంలో కూడా విస్తృతంగా చర్చించామని, ఈ విషయంపై సమగ్ర నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, న్యాయనిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వర్సిటీ వీసీ పేర్కొన్నారు.

## పాక్‌కు రక్షణ సమాచారం చేరవేత

లూడో గేమ్ యాప్‌ను ఉపయోగించి సంస్థకు చెందిన సున్నితమైన పత్రాలు, పరికరాల వివరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తికి సంబంధించిన డేటా, ఉద్యోగుల సమాచారం వంటివి ఆమెకు చేరవేశాడు. లీక్ అయిన సమాచారం వల్ల భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నట్లు- ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ఇదే పాక్ ఏజెంట్ నేహా శర్మకు లీక్ చేస్తున్న ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పుర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెకానిక్ రవీంద్ర కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదట స్నేహం పేరుతో అతడికి ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఆమె అనంతరం అతడికి వలపు వల విసిరి..రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని, లేఖలను తీసుకున్నట్లు- తెలిపారు. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు- వెల్లడించారు.

## బడ్జెట్ పేరుతో ప్రజలను దారుణంగా మోసం

పుట్టబోయే బిడ్డపైనా ఎంత అప్పు భారం ఉందో వాస్తవాలను వివరిస్తే బాగుండేదని ఆయన వ్యాఖ్యానించారు. మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొన్న హామీలను పూర్తిగా గాలికొదిలేసినట్లు- ఈ బడ్జెట్ తో తేటతెల్లమైంది. మహిళలకు నెలనెలా రూ.2,500లు, తులం బంగారం, స్కూటీ- ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ గత బడ్జెట్ లోనూ నయాపైసా కేటాయించలేదు. ఈ బడ్జెట్ లోనూ ఆ ప్రస్తావన తీసుకురాకపోవడం దుర్మార్గం. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలనెలా రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇచ్చే అంశంపై బడ్జెట్ లో కేటాయింపులు జరపకపోవడం సిగ్గు చేటు-. ఇక విద్యా భరోసా ప్రస్తావనే లేదు. వృద్ధుల పెన్షన్ పెంపును ప్రస్తావించకుండా వారిని గాలికొదిలేసింది. నేటి బడ్జెట్ కేటాయింపులను చూస్తుంటే...కాంగ్రెస్ తిరోగమమన పాలనకు నిలువుటద్దం ఈ బడ్జెట్ అని తేలిపోయింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 420కిపైగా హమీల్లో 10 శాతం కూడా అమలయ్యే అవకాశం కన్పించడం లేదన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల 91 వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆచరణలోకి వచ్చేసరికి రూ.2 లక్షల కోట్లు- కూడా ఖర్చయిన దాఖలాల్లేవు. కోతలు కోయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కార్ ను మించిపోయింది. గతంలో దళిత బంధు పేరుతో కేసీఆర్ ప్రభుత్వం 2023లో రూ.17 వేల కోట్లకు పైగా కేటాయించినా....ఆచరణలో మాత్రం నయాపైసా ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిన నడుస్తోంది. గత బడ్జెటట్ లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున నిర్మిస్తామని పేర్కొంటూ ఇందిరమ్మ ఇండ్ల కోసమే రూ.7,500 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఆచరణలోకి వచ్చే సరికి నయా పైసా ఖర్చు చేయలేదు ఒక్క ఇల్లు కూడా కట్టియ్యలేదు. గత ఆర్థిక సంవత్సరంలో వైద్య రంగం అస్తవ్యస్తంగా మారింది. ఆసుపత్రుల్లో మందులిచ్చే పరిస్థితి లేదు. నేతన్నలను పూర్తిగా వంచించేలా బడ్జెట్ లో కోత విధించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం ఏర్పాటు- ఊసు లేదు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం స్విగ్గీ, జొమాటో, అమెజాన్ వంటి సంస్థల్లో పనిచేసే గిగ్ వర్కర్స్ కు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని నిర్ణయిస్తే.... తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు- చేసి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో ఆ ఊసే ప్రస్తావించకపోవడం సిగ్గు చేటు-. ఇక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను ఈ బడ్జెట్ లో పూర్తిగా విస్మరించింది. ఉద్యోగుల డీఏలు, పెండింగ్ సమ్యలు, పీఆర్సీ ప్రస్తావనే లేదన్నారు. కులగణన పేరుతో బీసీ రిజర్వేషన్లలో కోత విధించిన పార్టీ బడ్జెట్ కేటాయింపుల్లోనూ బీసీ కులాల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. అంబేద్కర్ అభయ హస్తం పేరుతో దళితులకు రూ.12 లక్షల చొప్పున ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ... బడ్జెట్ లో కనీసం ఆ ప్రస్తావన కూడా తీసుకురాకపోవడం సిగ్గు చేటన్నారు. తెలంగాణలో వైద్య, విద్యా రంగాల దుస్థితి దారుణంగా ఉంది. సర్కారీ ఆసుపత్రుల్లో సూది, మందులు, కాటన్ కూడా లేక అల్లాడుతుంటే నిధులు పెంచకుండా పేద రోగులను గాలికొదిలేసింది. ఎన్నికల్లో విద్యకు పెద్ద ఎత్తున కేటాయింపులు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ నేతలు బడ్జెట్ కేటాయింపులను చూస్తే పొంతనే లేదు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారు. రైతు సంక్షేమ రాజ్యంగా మారుస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నేతలు... రైతు రాబందు రాజ్యంగా మార్చేలా బడ్జెట్ కేటాయింపులు చేయడం దుర్మార్గం. 20 లక్షల మందికి పైగా రైతులకు నేటికీ రుణమాఫీ కాలేదు. అయినప్పటికీ బడ్జెట్ లో ఆ ఊసే ప్రస్తావించకుండా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది రైతు కుటు-ంబాలను దారుణంగా వంచించింది. కోటి మంది రైతు కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం ఇస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం.... వాటికి కేటాయింపులు జరపకపోగా సిగ్గు లేకుండా అబద్దాలను వల్లించడం దారుణం అన్నారు. ఆదాయ, వ్యయాలను చూస్తుంటే అప్పులు చేయడం, ఆస్తులు అమ్మడం తప్ప మరో మార్గం లేదన్నట్లు-గా కాంగ్రెస్ పాలన మారింది. కేసీఆర్ ప్రభుత్వం ఏటా 67 వేల కోట్ల అప్పు చేస్తే... రేవంత్ రెడ్డి ప్రభుత్వం 15 నెలల్లోనే రూ.1.58లక్షల కోట్లు అప్పు తీసుకురావడాన్ని చూస్తుంటే..... అప్పులు చేయడంలో, ఆస్తుల అమ్మడంలో, దివాళా తీయడంలో, ప్రజలపై భారం మోపడంలో, అబద్దాలను ప్రచారం చేయడంలో, అవినీతి, దోపిడీలో కేసీఆర్ ప్రభుత్వాన్ని మించిపోయినట్లు- కన్పిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 6 గ్యారంటీల అమలు కోసం ఈ బడ్జెట్‌లో కేటాయింపులను చేసేలా సవరణలు చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

## ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య కీలక ఒప్పందం

సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ఏపీ గవర్నమెంట్, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక సహకారానికి రూపకల్పన చేస్తుంది. దీనిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించిన భాగస్వాములకు, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలలో వివిధ ప్రయోజనాల కోసం గేట్స్ ఫౌండేషన్ మద్దతు ఇస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఆరోగ్య విశ్లేషణ, ఆటోమేటెడ్ డయాగ్నస్టిక్స్ కోసం ఏఐని ఉపయోగించడం జరుగుతుంది. వ్యవసాయంలో, ఏఐ ఆధారిత సలహా వేదికలు, ఖచ్చితమైన వ్యవసాయం, వనరుల నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టనున్నారు. కాగా, గేట్స్ ఫౌండేషన్ మద్దతుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలనే తన నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. 'గేట్స్ ఫౌండేషన్‌తో మా భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుంది. ఏఐ ఆధారిత పాలన, మానవ మూలధన అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్యలో సాంకేతిక ఆవిష్కరణలను ఉపయోగించడం ద్వారా, ఈ అవగాహన ఒప్పందం ద్వారా వచ్చే ఫలితాలు మన రాష్ట్రానికి మాత్రమే కాకుండా, ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.



## వీడలేమంటూ వీడుకోలంటూ ఘనంగా వీడ్కోలు

మిర్యాలగూడ, మార్చ్19:-( వార్త మిర్రర్) నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్ప గూడెం స్కూల్లో 2024-25 బ్యాచ్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి శిరీష అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగాశిరీష మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగాలని ఉన్నత పౌరులు అనగానే డబ్బు, హోదానో కాకుండా జీవితంలో సమాజంలో తోటి వ్యక్తులకు సహాయ సహకారాలు అందిస్తూ అందరిచేత మన్నలను పొందుతూ నైతిక విలువలను పాటిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తూ, కొవ్వొత్తి తను వెలుగుతూ పదిమందికి వెలుగునిస్తున్నట్లుగా ఇతరులకు ఉపయోగపడే వ్యక్తి సమాజ చైతన్యానికి స్ఫూర్తి నింపుతాడని, అందుకోసమే విద్యార్థులు భవిష్యత్తులో కొవ్వొత్తి లాగా వెలుగుతూ సమాజ చైతన్యానికి ప్రయత్నం చేస్తూ మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు నారబత్తుల జనార్ధనా చారి జ్ఞాపకార్థం వారి కుమారులు నారా బత్తుల ఉదయ్ పరీక్ష సామాగ్రిని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టిబాబు నాయక్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి, జల్ రామ్, చంద్రకళ, సి ఆర్ పి గోవర్ధన్, రవి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలో చిన్నారికి జన్మదిన వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 19 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డెరకాలనీ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో బుధవారం ప్రీస్కూల్ విద్యార్థి విశ్వక్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంగన్వాడీ టీచర్ బియ్యాని సుజాత చిన్నారితో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....రెండు సంవత్సరాల 6 నెలల పిల్లలనుండి ఆరు సంవత్సరాల వయస్సు వరకు గల పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. వారికి సంబంధించిన అక్షరాభ్యాసం,అన్నప్రాసన, జన్మదిన వేడుకలను అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించుకుంటూ పిల్లలకు ఆటపాటలతో విద్యనందిస్తూ పిల్లల మెదడు పెరుగుదలకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి అందించే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## నేత్రదానంతో ఇతరులకు కంటి చూపు ప్రదానం

### నేత్రదానం అభినందనీయం

### డైమండ్ శ్రీనివాస్

మిర్యాలగూడ మార్చి 19:- (వార్త మిర్రర్) తమ కుటుంబ సభ్యుడు మరణించిన బాధలోనూ నేత్రదానం చేసి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘటన మిర్యాలగూడ, నల్లగొండలలో జరిగింది. మిర్యాలగూడ పట్టణం రవీంద్రనగర్ కు చెందిన మూడవత్ నాగు(34) బుధవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో ప్రాణాలను కోల్పోయారు. మరణాంతరం వారి కుటుంబ సభ్యులను డైమండ్ నేత్రనిధి ఐ బ్యాంకు టెక్నీషియన్ బచ్చలకూర రమేష్ కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను సేకరించారు. ఐ డైమండ్ నేత్రనిధి చైర్మన్ లయన్ మాశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి నేత్రదానం గురించి వారికి నచ్చ జెప్పారు. ఇద్దరు అంధులకు చూపునిచ్చే అవకాశం ఉంటుందని చైతన్య పరచడంతో నెత్రాలను తీసి వెంటనే డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంకు హైదరాబాద్ కు పంపించారు. ఈ నెల 18న నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన దుదిమెట్ల లక్ష్మయ్య (65) నేత్రాలను కూడ డైమండ్ ఐ బ్యాంక్ వారు తీశారు. నేత్రదానం మహాదానమని ముందుకు వచ్చినందుకు కుటుంబ సభ్యులకు డైమండ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబ సభ్యులు మరణించిన బాధలోనూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలనే సదుద్దేశ్యంతో నేత్రడానానికి ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

### వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్

ఎల్బీనగర్, 18 మార్చ్: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురం డివిజన్ చింతలకుంట నివాసి బి.యాదయ్య అనారోగ్య సమస్యతో బాధ పడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స చేర్పించాలని వనస్థలిపురం కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహా యాదవ్ ని సంప్రదించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సహకారంతో అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ వో సి ద్వారా 3 లక్షల రూపాయలు మంజూరు చేయించి, ఈరోజు సీఎం సహాయ నిధి ఎల్ఓసి పత్రాన్ని బి.యాదయ్య కి వనస్థలిపురం డివిజన్ ఆఫీసులో అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్ అందజేశారు.

## ప్రజా ఉద్యమాలు బలపడినప్పుడే మల్లు స్వరాజ్యాంకు నిజమైన నివాళులు

మిర్యాలగూడ, మార్చి:-19 (వార్త మిర్రర్) తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు అమరజీవి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం చేసిన ఉద్యమాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతి సభ నిర్వహించారు ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు సిపిఎం సీనియర్ నాయకులు నూకల జగదీశ్ చంద్ర అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నాడు దోరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పేద ప్రజల కోసం ప్రజా ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. ఆయుధాన్ని చేత పట్టి పీడిత ప్రజల కోసం ఉద్యమాలు నడిపి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. రజాకాలను దొరలకు, భూస్వాములకు ఆనాడే దడ పుట్టించి వీరవనితగా నిలిచారని చెప్పారు. నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజా ఉద్యమాలకు పునాదివేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని కోరారు. ప్రజా పునాది బలపడినప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ప్రజా ఉద్యమాలు బలంగా జరిగినప్పుడే మల్లు స్వరాజ్యం కు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, వన్ టౌన్, టూ టౌన్



కార్యదర్శులు డా.మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగా రెడ్డి, పాదురీ శశిధర్ రెడ్డి, రేమిడల పరుశురాములు, పోలేబోయిన వరలక్ష్మి, గాదె పద్మ, ఆయూబ్, స్వరాజ్యం మనవడు మల్లు వంశీ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రావు, తిరుపతి రామ్మూర్తి, గోవర్దనా, లక్ష్మీ నారాయణ, కోటి రెడ్డి, అరుణ, బీబమ్మ, కరిమున్నిసా బేగం, పిల్లుట్ల సైదులు, కోడి రెక్క మల్లయ్య, కౌసల్య, కరీం, వెంకన్న, ఉన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలి.

### డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్.

మిర్యాలగూడ ,మార్చి 19:-( వార్త మిర్రర్) భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవినాయక్ కోరారు.బుధవారం మిర్యాలగూడ లో ఎస్ఎఫ్ఐ,డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సైదా నాయక్ అధ్యక్షతన "అందరికి సమాన విద్యా ఉపాధికై" అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆనాడు భగత్ సింగ్ స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంతో అందరికీ విద్య,అందరికీ ఉపాధి కొరకు పోరాడి నూనూగు మీసాల వయసులో ఉరికంబాన్ని ముద్దాడారని తెలిపారు.ప్రస్తుత పాలక ప్రభుత్వాలు సమానమైన నాణ్యమైన శాస్త్రీయమైన విద్య అందించడంలో విఫలమవుతున్నారని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు మెస్ కాస్మోటిక్స్ చార్జీలు స్కాలర్షిప్ బకాయిలు,సంక్షేమ హాస్టల్ లకు సొంత భవనాలు,ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కాలేజీలు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఎన్నికల హామీలో భాగంగా యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ




చేయాలన్నారు.వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు.నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సెమినార్ లో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను,ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ముడావత్ జగన్, దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ వీరన్న,ఇందు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

### రాయికల్ సారంగాపూర్ మండలాల్లో లో విస్తృతంగా పర్యటన

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 19

బుధవారం రోజున రాయికల్ మండల బొర్నపల్లి గ్రామంలోని 20 లక్షల వ్యయంతో చేపట్టుతున్న హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ దశలో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.నెల రోజుల లోపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఇటిక్యాల గ్రామంలో 9 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను అధికారులతో కలిసి పరిశీలించి. నెల రోజుల వరకు త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. అల్లిపూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో చేపడుతున్న పల్లె దవఖాన సబ్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి.ఏప్రిల్ మొదటి వారంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సారంగాపూర్ మండలం లచ్చక్క పేట గ్రామంలో చేపడుతున్న సిసి రోడ్ వర్క్స్ అని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.నాగునూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో చేపడుతున్న పల్లె దవాఖాన నిర్మాణ దశలో ఉన్న పనులను పరిశీలించి. 2 నెలల లోపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. హెల్త్ సబ్ సెంటర్లు ఎన్ఆర్ఈజీఎస్ క్రింద చేపడుతున్న సిసి రోడ్డు వర్క్స్ అన్ని కూడా వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు



ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డిఈ మిలిండు, తహసీల్దార్, ఎంపీడీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వర్గీకరణపై ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటాం

### లిమాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ, మార్చి 19:-( వార్త మిర్రర్) ఎస్సీ వర్గీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్లో ఆయన అధ్యక్షతన జరిగిన మాలల ఆత్మగౌరవ సభలో రేవంత్ రెడ్డి సర్కార్ పై విరుచుకుపడ్డారు. అశాస్త్రీయంగా చేసిన వర్గీకరణ బిల్లును అడ్డుకుంటామన్నారు.రాష్ట్రంలో మాలలు ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్ర వెళ్ళిపోయిన మాలలను కూడా తెలంగాణలో చూపించే విధంగా 2011 జనాభా లెక్కలను ప్రాతి ప్రతికగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. వర్గీకరణ పై సుప్రీంకోర్టు కేవలం సూచన మాత్రమే చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించడం అన్యాయమన్నారు. శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టేముందు ఎస్సీ జాతీయ కమిషన్, పార్లమెంటు ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఆమోదిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాన్ని చూసైనా రేవంత్ రెడ్డి సోయి తెచ్చుకోవాలన్నారు. మాలల ఆత్మగౌరవం దెబ్బతీనేలా వర్గీకరణకు ఆమోదం తెలిపిన కాంగ్రెస్ పార్టీని రాబోయే రోజుల్లో బొంద పెడతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పైన సుప్రీంకోర్టులో కేసు వేసి న్యాయపోరాటం చేస్తామన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందేందుకే అగ్రవర్ణ పార్టీలు వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. ఈ



సందర్భంగా మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా బొప్పాని నగేష్ ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసి నియామక పత్రం అందజేశారు. సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, సీనియర్ నాయకులు కోడిరెక్క షౌరి, చిక్కుడు గుండాల అధ్యక్షులు రాజకుమార్, లక్ష్మణ్, జాతీయ అధ్యక్షులు పున్నమ్మ, ధనమ్మ లు పాల్గొన్నారు.



## వచ్చేనెల 2న కడ్తాల్ మండలానికి హరీష్ రావు రాక

**- సరికొండ,ముద్విన్ గ్రామంలో పర్యటన**

**- ముద్విన్ లో రాధాకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించబడ్డ ఇంటిని ప్రారంభించనున్న హరీష్ రావు**

కల్వకుర్తి కడ్తాల్ మార్చ్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ రెండో తారీఖున కడ్తాల్ మండలానికి రావాలని ఆహ్వానించారు. ఏప్రిల్ 2న సరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన్ గుట్ట తండాలో సేవాలాల్ మహారాజ్ మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. దానితోపాటు ముద్విన్ గ్రామపంచాయతీలో ఒక పేద కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్మించబడిన నూతన గృహాన్ని ప్రారంభించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హరీష్ రావు ఏప్రిల్ 2న తప్పకుండా కడ్తాల్ మండలానికి వస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ, మాజీ ఉపసర్పంచ్ నరేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగయ్య, నరేష్, సాబీర్, అంజి, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.



## కులగణన విజయోత్సవ వేడుకలలో

### జగదీశ్వర్ గౌడ్ యలమంచి ఉదయ్ కిరణ్, టీమ్ సభ్యులు.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : బీసీ రిజర్వేషనల్లో దేశానికి తెలంగాణ ఆదర్శం,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు/ఎస్సీకి వర్గీకరణ కార్యక్రమం లు చారిత్రాత్మకమని,సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని అభివర్ణిస్తూ.. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచిందని అన్నారు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జెనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, వివిధ కాలనీల కు చెందిన నాయకులు,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ రోదనలకు బాధ్యులు ఎవరు...?

- మొదట ఆపరేషన్ లో నవజాతి శిశువు మృతి. రెండవ సిజేరియన్ ఆపరేషన్ లో బాలింత మృతి
- ఆసుపత్రి నిర్వహణ పై మండిపడ్డ మాజీ మంత్రి చిత్తరంజన్దాస్
- డాక్టర్లను వెంటనే సస్పెండ్ చేయాలి తల్లోజు ఆచారి
- బాలింత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని బాధితుల ఆందోళన
- ముమ్మాటికి ప్రభుత్వ హత్యే.. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయగౌడ్







కల్వకుర్తి మార్చ్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:– ఆ నిండు చూళాలు కన్న కళలు ఎంత సేపు నిలువలేదు.. నవమాసాలు మోసి మనస్ఫూర్తిగా చూసిముద్దాడాలన్న స్వప్నం ఆడి ఆశలు అయ్యాయి... బాబు పుట్టాడు అన్నప్పుడు ఆ పురిటినొప్పులను సైతం లెక్కచేయకుండ ఆ బాలింత ముసిముసినవ్వులు నవ్వింది... ఆ నవ్వు గంటన్నరలోపే గాలిలో కలిసిపోయిన హృదయవిషాదకరమైన సంఘటన కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎముక నందిని (25), మూడవ కాన్పుకోసం సోమవారం ఉదయం ఆశవర్కర్ సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. మొదటగా ఆమెకు ఉదయం 11:30 గంటల సమయంలో సిజేరియన్ ఆపరేషన్ చేసి, మగబిడ్డకు పురుడు పోశారు. ఆ తర్వా త బిడ్డ ఎడవడం లేదంటూ,హైదరాబాదులోని నిలోఫర్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించి,చేతులు దులుపుకున్నారు.నిమిషాల వ్యవధిలోనే అంబులెన్స్ మాట్లాడి హైదరాబాద్ తీసుకెళ్తాండగా తుక్కుగూడ వెళ్లగానే మార్గమధ్యంలో కన్నుమూశాడు. అంతకు ముందు పదినిమిషాల పాటు అంబులెన్స్ డ్రైవర్ పెట్రోల్ పోసుకోవడంలో ఆలస్యం చేయడం జరిగింది.రెండవ ఆపరేషన్ లో బిడ్డ క్షేమం.. తల్లి మృతిమొదట ఉదయం 11 గంటలకు చేసిన సిజేరియస్ ఆపరేషన్లో మగబిడ్డ చనిపోగా, రెండవ సారి 12 గంటల సమమంలో చేసిన ఆపరేషన్ లో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల (23), చనిపోతానని ఊహించలేకపోయింది. ఆపరేషన్ గదిలోకి వెళ్లే వరకు ఆ తల్లి బంధువులు, స్నేహితులతో మాట్లాడింది. ఆపరేషన్ గదిలోకి వెళ్లేముందు అమ్మ వెళ్లివస్తా ఆన్నమాటలు చివరి మాటలు అయ్యాయి. ఆపరేషన్ చేసిన వైద్యులు ఆడబిడ్డకు పురుడుపోశారు.. కానీ తల్లిని కాపాడలేకపోయారు.అధిక రక్తస్రావం అవుతుండడంతో, ఆసుపత్రిలో బెడ్ పై పడుకోబెట్టారు.రక్తస్రావం అవుతుందని.... బంధువులు,ఆసుపత్రి నర్సులకు తెలియజేసిన వారు స్పందించలేదు. చివరవకు వారు ఆగ్రహించడంతో హైదరాబాద్ జడ్జిఖాన ఆసుపత్రికి వెళ్లాలి అని చెప్పవడంతో వారికి ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్ రాలేదు. అరగంట సమయం వృథా చేశారు.చివరకు అంబులెన్స్లో తీ సుకెళ్తుండగా మార్గమధ్యంలో ఈ తల్లి బిడ్డను చూడకుండానే మృత్యువులోకి వెళ్లింది. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే రోజు ఒక నవజాతి శిశువు మృతి చెందడం,ఆ తర్వాత బాలింత మృతి చెందడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఉలికిపాటుకు గురైయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం కోల్పోవాల్సి వస్తోంది.డాక్టర్ల నిర్లక్ష్యంపై మండివడ్డ మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్పేదల ఆరోగ్యం, ఆసుపత్రుల నిర్వహణ కోసం లక్షల రూపాయలు కేటాయిస్తే, డాక్టర్లు,సిబ్బంది ఎవరికి సేవలు అందించాడకుండ ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారని మాజీ మంత్రి చిత్తరంజన్దాస్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాతి శిశువు, పచ్చి బాలింత చనిపోయిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని మంగళవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరులత సమావేశంలోమాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ డాక్టర్లు పేదలకు వైద్య సేవలు అందించడం ఆసుపత్రులు పెట్టుకొని ప్రైవేట్ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన దుయ్యబట్టారు. వారి సొంత ఆసుపత్రులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులను భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే ఇద్దరు మృతి చెందారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎం.పి మల్లురవి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదారం రాజనర్సింహ్మాకు తెలియపరుస్తానని ఆయన అన్నారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఉండడం,డాక్టర్లు పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. ఇలా ఉంటే పేదలకు ప్రభుత్వంపై నమ్మకం పోతుందన్నారు. మరోమారి ఇలాంటి సంఘటనలు జరుగకుండ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆసుపత్రి ముందు మృతి చెందిన బాలింత కుటుంబ సభ్యుల ధర్నాఆసుపత్రి ముందు మృతి చెందిన బాలింత శ్యామల కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది సకాలంలో స్పందించక పోవడంతోనే బాలింత మృతి చెందిందంటూ మృతి రాలి బంధువులు, భర్త ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ధర్నాను భగ్నం చేసే క్రమంలో వారు మహబూబ్ నగర్ చౌరస్తాకు వచ్చి,ధర్నా చేశారు.దీంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి స్పందించి మృతురాలి భర్తకు ఉద్యోగం, పిల్లల చదువుకు భరోసా ఇవ్వడంతో పాటు అంత్యక్రియలకు 30 వేల రూపాయలు ఇస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.ముమ్మాటికి ప్రభుత్వ హత్యే... టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయగౌడ్ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన రెండు మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని టీఆర్ ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు విజయగౌడ్ అన్నారు. డాక్టర్ల నిర్లక్ష్యం, సిబ్బంది వైఫల్యం మూలంగానే నవజాతి శిశువు, పచ్చి బాలింత మృతి చెందడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు సేవలు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

# నిర్లక్ష్యపు డాక్టర్లను వెంటనే సస్పెండ్ చేయాలి

### - మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి



కల్వకుర్తి మార్చ్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:– వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ మృతి చెందిన సంఘటన నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల (23) రెండో ప్రసవం కోసం సోమవారం ఆసుపత్రి లో చేరారు. మంగళవారం ఆడబిడ్డ కు జన్మనిచ్చి తను మరణించింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆచారి మాట్లాడుతూ ఈ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత డాక్టర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. సంఘటన గడిచి 24 గంటలు అవుతున్న ఒక్క అధికారి కూడా స్పందించలేదని అన్నారు. పేదవారు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే తిరిగి ఇంటికి వెళ్తారనే నమ్మకం లేకుండా పోతుందని,డాక్టర్ల పై చర్యలు తీసుకోకపోతే వీరి ప్రైవేట్ హాస్పిటల్ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలు మాత్రం దుర్భరస్థితిలో ఉన్నాయని,కనీసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం అయినా కల్వకుర్తి లో ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని ఆపరేషన్ చేసిన డాక్టర్ అన్నపూర్ణ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పూర్వం గ్రామాలలో ఉండే మంత్రసానులు డెలివరీ సురక్షితంగా చేసేవారు అలాంటిది ఇంత టెక్నాలజీ పెరిగినా డాక్టర్లు డెలివరి చేస్తే చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దీనికి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని, మృతురాలి కుటుంబానికి ఒక ఉద్యోగం, డబల్ బెడ్ రూమ్, ఇవ్వాలని అదేవిధంగా వారం రోజుల్లో డాక్టర్ ని సస్పెండ్ చేయకుంటే భారతీయ జనతా పార్టీ తరపున భారీ ఎత్తున ధర్నా చేస్తామని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గాప్రసాద్, గుర్రాల రాంభూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్ పట్టణ అధ్యక్షులు బాబీ దేవ్, రాఘవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## యువత,విద్యార్థులు డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి:::: ఎస్ఎఫ్ఐ




కొండ మల్లేపల్లి మార్చి 19 వార్త మిర్రర్ కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎస్.ఎఫ్.ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ ) సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న షహిద్ భగత్ సింగ్ స్మరక యువజన ఉత్సవాల పోస్టర్ ను కొండమల్లేపల్లి ఎస్సై రామ్మూర్తి ఆవిష్కరణ చేయడం జరిగింది.అనంతరం కొండమల్లేపల్లి ఎస్సై రామ్మూర్తి గారు మాట్లాడుతూ విద్యార్థులు,యువత డ్రగ్స్, గంజాయి లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలునిచ్చారు. డ్రగ్స్,గంజాయి నిర్మూలన కోసం కృషి చేయడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అన్నారు. నేటి యువత లో కొద్దిమంది చెడు వ్యసనాలకు అలవాటుపడి వారి జీవితలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. దేశంకోసం ప్రాణర్పణ చేసిన భగత్ సింగ్ స్ఫూర్తి తో యువజన ఉత్సవాలను నిర్వహించడం ఎస్.ఎఫ్.ఐ, డి.వై.ఎఫ్.ఐ సంఘాలు “సే నో టూ డ్రగ్స్” నినాదంతో క్యాంపెయిన్ నిర్వహిస్తుండటం జరుగుతుంది. సామ్రాజ్యవాదులు, బ్రిటిష్ తెల్లదొరలు భారత దేశ ఖనిజాలు, సంపదను దోపిడి చేస్తుంటే దానికి వ్యతిరేకంగా మొదటి సారిగా పోరాడిన వ్యక్తులు భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ ముఖ్యంగా భారత దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ 23 సంవత్సరంలోనే తన ప్రాణాలను దేశం కోసం త్యాగం చేశారు భారతదేశ సంపద దేశంలో ఉన్నటువంటి ప్రతి పౌరుడికి దక్కాలని బ్రిటిష్ వారి దోపిడికి వ్యతిరేకంగా పోరాటం చేసినారు. కాబట్టి ప్రతి ఒక్కరికి దేశ సంపద అందాలి అంటే యువత భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ పాలకుల మీద తిరగబడ్డ వలసిన అవసరం ఉంది. నేటి యువతకు నేటి విద్యార్థులకు అతను దిక్సూచి అని కొనియాడారు. భగత్ సింగ్ కేవలం ఒక వీరుడుగా మాత్రమే అందరికి తెలుసు కానీ నీ అతనొక అధ్యయనశీలి,అతను ఒక రచయిత, ఆయన రాసిన రచనలు వ్యాసాలు చూస్తే అప్పటికి భారతానికే కాకుండా ఇప్పుడు మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆయన వ్యాసాలలో ఒక దిశానిర్దేశం దొరుకుతుంది అని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితులను చూస్తే, ఆయన రాసిన మత ఘర్షణలు వాటి నివారణ, అంటరానితనం అనే వ్యాసాలలో దేశ ప్రజలు ఎలా మెలగాలో వివరించారు. భగత్ సింగ్ అతను జైలు నుండి, పంజాబ్ విద్యార్థి మహాసభలకు పంపిన సందేశం, దేశం పట్ల రాజకీయాల పట్ల ఎలా ప్రవర్తించాలో రాశారు. కాబట్టి విద్యార్థి లోకమంతా భగత్ సింగ్ స్ఫూర్తి తీసుకుని చదవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రతి జిల్లాలో భగత్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ డివిజన్ ఎస్ ఎఫ్ ఐ డివైఎఫ్ఐ నాయకులు ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జెల్లెల ఇద్ది రాములు బుడిగ వెంకటేష్, పొట్ల రాకేష్, దున్న రవి, రామావత్ రాజేష్,ఉప్పల గణేష్, లతా నియల్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తు మిఠాయిల పంపిణి చేసిన బీసీ నేతలు



మిర్యాలగూడ, మార్చి 19:–( వార్త మిర్రర్) బీసీలకు విద్యా,ఉద్యోగాల్లో మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్ లను 42 శాతం పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వేంకటేశ్వర్లు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేస్తు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చట్టం బీసీల మొదటి పోరాట విజయమని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, బిల్లుకు బేషరతుగా మద్దతు తెలిపిన బిఆర్ఎస్, బీజీపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల నేతలకు సమస్త బీసీ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. బీసీ బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, ముదిరాజ్, నక్క నాగరాజ్, శంకర్, చందు, రవి, సిద్దు, గోపి, కిషోర్, శివ, మున్నా, మహేందర్, నవీన్, వెంకటేష్, దిలీప్, సాయి పాల్గొన్నారు



## ఘనంగా గణేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ శాలువా కప్పి, కేక్ కట్ చేసి గణేష్ ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందు ముందు మరెన్నో వేడుకలు జరుపుకొని జీవితంలో, రాజకీయాల్లో పైకి రావాలని రవికుమార్ యాదవ్ ఆకాంక్షించారు. మంచి భవిష్యత్ ఉన్న నాయకులు గణేష్ ముదిరాజ్ అని, సేవా, సామజిక రంగాల్లో ఎప్పుడు ముందుంటారని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, కొంచె శివరాజ్ ముదిరాజ్, నర్సింగ్ రావు, నరేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

# రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి

### - పైళ్ళ ఆశయ్య రాష్ట్ర కార్యదర్శి



కల్వకుర్తి మార్చ్19 వార్త మిర్రర్ ప్రతినిధి:– 2025–06 సంవత్సర బడ్జెట్ లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ:200కోట్లు ప్రభుత్వం బడ్జెట్లో కేటాయింపులు చేశారు. ఉచిత విద్యుత్ పథకానికి రూ:150కోట్లు, సంక్షేమ మరియు మోడ్రన్ ధోబీఘాట్లు నిర్మాణానికి కేవలం రూ:50 కోట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో సుమారుగా ఐదు లక్షల కుటుంబాలు రజక వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నారు.నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తి జీవనాధారంగా బ్రతికే కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నారు. కావున సంక్షేమానికి మరింత బడ్జెట్ పెంచి ఈ కేటాయింపులను సవరణ చేసి రూ:1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాము.ఇప్పటికే రాష్ట్రంలో 4000 రజక సహకార సంఘాలు ఏర్పాటు చేసి ఉన్నాయని వాటన్నిటికీ రుణాల ఇవ్వాలని తెలిపారు. రజక వృత్తిదారులు సమాజంలో అత్యంత వెనుకబడి ఉన్నారని వారిని ఆదుకోవడానికి అరకొర బడ్జెట్ తో సంక్షేమం సాధ్యం కాదని తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం కోరుతుంది. మారిన వృత్తి పరిస్థితిలో వృత్తిలో వచ్చిన అధునాతన మార్పుల్ని వృత్తి శిక్షణ– ఉపాధి కల్పన ఆధునిక యాంత్రికరణ ధోబిఘాట్లను మరియు నూతన డ్రై క్లీనింగ్ లాండ్రీలను నెలకొల్పడానికి ప్రభుత్వం రూ:10 లక్షల వరకు వృత్తిదారులకు ఇచ్చే విధంగా బడ్జెట్ ని పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము. వృత్తి పనిలోవృద్ధులు అయిన వాళ్లకి ప్రత్యేక పెన్షన్ స్కీం ఏర్పాటు చేయాలని,సామాజిక దాడులు దౌర్జన్యాలు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఏర్పాటు చేయాలని కోరారు.




# విద్య రంగానికి 30% నిధులు కేటాయించాలని ఎస్ఎస్ఐ డిమాండ్

దేవరకొండ మార్చి 19 వార్త మిర్రర్:

అసెంబ్లీలో విద్యారంగానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని బడ్జెట విద్య రంగానికి తక్కువ నిధులు కావాలనే రేవంత్ రెడ్డి సర్కారు కేటాయిస్తుందన్నారు 23 వేల నూట ఎనిమిది కోట్లు రాష్ట్ర విద్య రంగా అభివృద్ధికి సరిపోవు అన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ కు సంబంధించింది 8 వేల కోట్ల దాకా పెండింగ్లో ఉన్నాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఓన్లీ 7.57 % మాత్రమే నిధులు కేటాయించారన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ విద్య సంస్థలు అన్ని ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు హాస్టల్స్ గురుకులాలు యూనివర్సిటీలు అభివృద్ధి కావాలంటే 30% నిధులు విద్యారంగానికి కేటాయిస్తేనే అభివృద్ధి చెందుతాయి అన్నారు. రాను రాను విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే విధంగా ఉంది అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రినీ కేటాయించి పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్స్ ను మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేసి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో దేవరకొండ మండల అధ్యక్షుడు రామావతు రాజేష్,గణేష్ శివ, గంగా రాజు,అనిల్, కుమార్ రవి, ప్రవీణ్, ఉపేందర్, మనోజు, విజయ్, శంకర్, ఆంజనేయులు, అనిల్, రవి, యశ్వన్, సుదర్శన్,వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



## చందంపేట లో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే బాలు నాయక్ చిత్ర పటాలకు పాలాభిషేకం

చందంపేట మార్చి 19 వార్త మిర్రర్ :దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండల కేంద్రంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, బీసీ లకు 42% రిజర్వేషన్ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపి, నిన్న అసెంబ్లీ లో బిల్లు పాస్ చేసినందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియచేయడంతోపాటు మండల కేంద్రలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జర్పుల బధ్య నాయక్. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ. మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం నాయక్.మాజీ మండల అధ్యక్షులు. మాజీ సర్పంచ్ లు. మాజీ ఎంపీటీసీ సభ్యులు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కేతావత్ రమేష్. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామావత్ సాయి రాథోడ్. మాజీ ప్రజాప్రతినిధులు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. యూత్ కాంగ్రెస్ నాయకులు. మండల విభాగం నాయకులు. బీసీ విభాగం నాయకులు. తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి



మిర్యాలగూడ మార్చి 19:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం జంకుతండా గ్రామ శివారు లోని ఆర్ఎస్ గోదాము సమీపంలో బుధవారం విద్యుతాఘాతానికి గురై గోడౌన్ పర్యవేక్షకుడు చింతపల్లి పవన్ కళ్యాణ్(19) మరణించగాపూజ దుర్గ (21)గాయపడ్డాడు. మరణించిన వ్యక్తి, గాయపడిన వ్యక్తి ఆర్ఎస్ గౌడౌన్‌లో పనిచేస్తున్న సమయంలో మధ్యాహ్నం ఒంటి గంట నుండి 1.30 గంటల సమయంలో క్రికెట్ ఆడటానికి ఇద్దరూ కాంపౌండ్ గోడ దూకడానికి ప్రయత్నించారు, ఆ సమయంలో మృతుడు గోడపైకి ఎక్కి ఒక చెట్టును పట్టుకున్నాడు. గోడ పైభాగంలో 33 కెవి విద్యుత్ సరఫరా జరుగుతోంది, ఆ చెట్టు కండక్టర్ కేబుల్‌కు తగిలి విద్యుతాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు.గాయపడిన మరొక వ్యక్తికి కూడా విద్యుతాఘాతానికి గురి కాగా మెరుగైన చికిత్స కోసం అతన్ని నల్గొండకు తరలించారు. చింతపల్లి కృష్ణాపిటిషన్ పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టెమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



## కీసరలో జాబ్ మేళా కు తరలి వచ్చిన మహిళలు

### ఎం ఎన్ సి లో మహిళలకు ఉపాధి అవకాశాలు

### ప్రతి నెల17,500 రూపాయల జీతం

### కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కంపెనీలో అవకాశాలు

కీసర,వార్త మిర్రర్ మార్చ్19:కీసరలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను పొందారని కీసర మాజీ ఉపసర్పంచ్,జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా అన్నారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలకు మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా తెలిపారు.కొంగరకలాన్ లో సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్ కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని,తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన వివరించారు.నిరుద్యోగ మహిళల దృష్టిలో పెట్టుకొని ఈనెల బుధవారం కీసర గ్రామపంచాయతీ వద్ద గల కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా ను నిర్వహించామని తెలిపారు.అర్హత ఉన్న నిరుద్యోగ యువతులు,మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో సుమారు 30 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు.ఎంపికైన మహిళలకు ప్రతి నెల 17,500 జీతం ఉంటుందని అందులో సుమారు 4 వేల రూపాయలు పిఎఫ్,ఈఎస్ఐ కోసం చెల్లింపులు ఉంటాయన్నారు.కీసర నుంచి ప్రతిరోజు కంపెనీ వద్దకు ఏసీ బస్సులో రావడం పోవడంతో పాటు టీ,టిఫిన్,భోజనం వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు.ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని,ఓ.టీ చేసిన వారికి రెండింతల వేతనం ఉంటుందని వివరించారు.పదవ తరగతి, ఐటిఐ,డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు,ఇంటర్మీడియట్,డిగ్రీ ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు.ఎంపికైన మహిళలకు శుక్రవారం నుంచి కంపెనీ వద్దకు బస్సు సౌకర్యం ఉంటుందని తెలిపారు.

## శ్రీనిధి డబ్బులు రిసోర్స్ పర్సన్ వాడుకుంటే వారిపై క్రిమినల్ కేసులు



మిర్యాలగూడ, మార్చి 19:- (వార్త మిర్రర్) శ్రీనిధి అమౌంట్ రిసోర్స్ పర్సన్స్, ఇంకెవరైనా వాడుకుంటే క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ శ్రీనిధి జడ్ఎం. అనంత కిషోర్ ఆర్ఎం బి శ్రీలేఖ హెచ్చరించారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం మీటింగ్ హాలులో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం (మెప్మా)రిసోర్స్ పర్సన్స్ సమావేశం లో వారు మాట్లాడుతూ మెప్మా నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రిసోర్స్ పర్సన్స్ శ్రీనిధి బకాయిల విషయంలో ఈనెల 31 లోగా పూర్తిగా చెల్లించాలని అన్నారు. స్వయం సే సమృద్ధి పనులు పూర్తి చేయాలని, డాటా సేకరణ పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ఆస్తిపన్ను ఎల్ఆర్ఎస్ ఈనెల 31లోపు 100శాతం వసూలు చేయాలని అన్నారు అదేవిధంగా ఇచ్చిన కొత్త సంఘాలు ఖచ్చితంగా టార్గెట్ పూర్తి చేయాలని అన్నారు. శ్రీనిధి నుంచి ఇప్పటివరకు16.84 కోట్లు రుణాలు ఇవ్వగా 2.72 అందులో కోట్లు పెండింగ్లో బకాయి ఉన్నాయన్నారు. సమావేశంలో మెప్మా టిఎంసి పి.బక్కయ్య సిఓ వెంకటేశ్వర్లు సతీష్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు .



## తెలంగాణ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలి

## ఎన్నికల్లో మాట ఇచ్చాం - నెరవేర్చాం: కె ఎల్ ఆర్

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 19...

బీసీ లకు 42శాతం రిజర్వేషన్లు ఎస్సి వర్గీకరణపై కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నందుకు మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.నియోజకవర్గం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సెల్, ఎస్సీ సెల్ విడివిడిగా డివిజన్లు, మండలాల్లో పాలాభిషేకాలు చేసి టపాసులు కాల్చారు.ఈ సందర్భంగా ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణ సర్వే చేసి బీసీలకు 42శాతం, ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీ సాక్షిగా చట్టబద్దం చేయటం హర్షనీయమన్నారు కేఎల్ఆర్.31ఏళ్ల సుధీర్ఘ ఎస్సీల పోరాటానికి కాంగ్రెస్ చేయూతనందించింది. బీసీలకు అన్ని ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో 42శాతం కోటా దక్కటం ఆయా ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువత, కుల వృత్తులను రూ.4లక్షలు సహా సబ్సిడీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇచ్చిందని కిచ్చెన్న అన్నారు.తెలంగాణ చట్టబద్దం చేసిన ఈ బిల్లులకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని లక్ష్మారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన కాంగ్రెస్ సహా అనుబంధ సంఘాలకు అభినందనలు తెలిపారు

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కి మాదిగ జాతి రుణపడి ఉంటుంది.

**నల్ల చంద్ర స్వామి మాదిగ**

**- ఎస్సీ వర్గీకరణ కు అసెంబ్లీ లో ఆమోదం పొందడం మాదిగల పోరాట విజయం**

**- మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం**

**- స్వీట్ల పంపిణి తో సంభరాలు**



(వార్త మిర్రర్ ప్రతినిధి) మార్చి 19:యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (యం) మండల కేంద్రం లో భువనగిరి – మోత్కూర్ ప్రదాన రహదారి వద్ద ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో మహా జననేత వర్గీకరణ సాధకుడు 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట యోధుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం, స్వీట్ల పంపిణి సంబరాల కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పియస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, హాజరై మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం గత 30 సంవత్సరాలుగా మహా జననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేసి వర్గీకరణ సాధించడం జరిగింది. మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ బిల్లును ఆమోదింప చేయడం గర్వించదగ్గదని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏదేమైనా వర్గీకరణ సాధకుడు మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితంగానే ఈ జాతికి ఫలాలు అందాయని ఫలాలు అందుతున్నాయని అంత గొప్ప మహోన్నతమైన నాయకుడు మందకృష్ణ మాదిగ అని ఆయనకు మాదిగ జాతి పక్షాన పాదాభివందనాలు తెలియజేస్తూ జాతీ యావత్ మందకృష్ణ మాదిగ కు రుణపడి ఉందని కొనియాడారు.ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మాదిగ అమరులకు జాతీ రుణపడి ఉంటుందని అన్నారు. అదేవిధంగా గత 30 ఏళ్లుగా మా జాతి ఉద్యమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు వ్యాపారవేత్తలకు,రాజకీయ నాయకులకు, మానవతావాదులకు, మీడియా పెద్దలకు, సామాజిక వాధులకు మాదిగ దండోరా పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీనాయకులుజిమండల ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ,మండల కన్వీనర్ పందుల భిక్షపతి మాదిగ,మండల నాయకులు గురుకు యాదగిరి మాదిగ,గంధమల్ల శివశంకర్ మాదిగ, గజ్జెల్లి పవన్ మాదిగ, గంధమల్ల గణేష్ మాదిగ, దుర్గ ప్రసాద్ మాదిగ,బీసి నాయకులు ఆర్ నారాయణ నాయిబ్రాహ్మణ, మైనార్టీ నాయకులు మజీద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



## పల్లెర్ల కళ్యాణి వెంకన్న గుప్త ఆధ్వర్యంలో మోత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సుల పంపిణీ

వార్త మిర్రర్ మోత్కూర్ మార్చ్ 19

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జడ్పిహెచ్ఎస్) లో ఈరోజు పల్లెర్ల కళ్యాణి వెంకన్న గుప్త గారు 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువులో మరింత సౌలభ్యంగా ఉండేలా సహాయపడేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి విజయాలు సాధించాలని, తమ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతగా విద్యా అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తానని పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తమ విద్యార్థులకు 1%ర 10116/-2 5116/-3 2116/- పారితోషికం అందిస్తామని అన్నారు.కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ, విద్యాభివృద్ధి సమాజ అభివృద్ధికి కీలకమని, ఇలాంటి సహాయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థులు కృషి చేసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. యువతకు మద్దతుగా నిలిచే వెంకన్న సేవా మనోభావాన్ని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు అరవిందరాయుడు, అంజయ్య, రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొని వెంకన్న కి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు తమకు అందిన సహాయాన్ని ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని హామీ ఇచ్చారు...

## జిల్లాలో పదవతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి..

### జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్.



వార్త మిర్రర్ జగిత్యాల (తిరుమల శంకర్) మార్చి 19

బుధవారం రోజున జగిత్యాల కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్య అధికారి, చీఫ్ సూపర్డింట్ వెహికల్ ఇంచార్జ్, సిట్టింగ్ స్వాడ్, ప్రిన్సిపల్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 67 పరీక్ష కేంద్రాలలో 11,865 మంది విద్యార్థులు బ్యాక్ లాగ్ విద్యార్థులు 285 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు మార్చి 21,వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయని అన్నారు.అన్ని పరీక్షలను ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష, జవాబు పత్రాల తరలింపు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, అలాగే స్ట్రాంగ్ రూమ్ ల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. సీసీ టీవీ కెమెరాల నిఘాలో పరీక్షలను జరుగుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు మొబైల్ ఫోన్స్ స్మార్ట్ వాచ్లు అనుమతి లేదని అన్నారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల దగ్గర పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు ఉంటుందని పరీక్ష జరుగుతున్నంతసేపు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో త్రాగునీరు టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్య అధికారి రాము, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## లింగోజిగూడెం స్మశాన వాటికను పరిరక్షించాలి.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 19

చౌటుప్పల మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యల పై సిపిఎం పోరు బాటలో భాగంగా లింగోజిగూడెం గ్రామంలో స్మశాన వాటిక కు ప్రహరీ గోడను నిర్మించి అంత్యక్రియలు జరపడానికి స్మశాన వాటికను నిర్మించి స్థానాల గదులు వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు బాతరాజు దశరథ అన్నారు. సిపిఎం పోరు బాటలో లింగోజిగూడెం గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా గోశిక కరుణాకర్ గ్రామంలోని సమస్యలు తెలుసుకుంటూ సర్వే నిర్వహించడం జరిగింది.లింగోజిగూడెంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి డ్రైనేజీని నిర్మించాలని లింగోజిగూడెంలో అర్హులైన ప్రజలకు రేషన్ కార్డులు పెన్షన్లు ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా మున్సిపల్ నాయకులు పర్నే ధర్మారెడ్డి,భావన్లపల్లి స్వామి,పద్మ, తూర్పునూరి వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

### భయంతో కాదు... భవిష్యత్తుకు బాసటగా నిలవాలి-రాపర్తి సురేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

10వ తరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందని అన్నారు. ఈ పరీక్షా సమయంలో సమయం అత్యంత విలువైందని తెలిపారు.భయాన్ని వీడి భవిష్యత్తుకు బాసటగా నిలవాలని కోరారు విద్యావేత్త రాపర్తి సురేష్ గౌడ్

## భయంతో కాదు... భవిష్యత్తుకు బాసటగా నిలవాలి-డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ యాదాద్రి భువనగిరి జిల్లాలో 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి ఇష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందని అన్నారు. ఈ పరీక్షా సమయంలో సమయం అత్యంత విలువైందని ఆ సమయాన్ని పరీక్షా సమయంలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.భయాన్ని వీడి భవిష్యత్తుకు బాసటగా నిలవాలని కోరారు సామాజికవేత్త, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

## బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు మరోసారి అన్యాయం.

### సీనియర్ న్యాయవాది సందుపట్ల రాము సాగర్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన 6 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బీసీ నాయకులు సందుపట్ల రాము సాగర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే ఆరు హామీలతో పాటుగా ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కానీ గత బడ్జెట్‌లో రూ.9 వేల కోట్లు, ఈ బడ్జెట్‌లో రూ.11 వేల కోట్లు మాత్రమే ప్రకటించారని, బీసీలకు జరిగిన ఈ అన్యాయ%శీ% పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీలకు రూ.40 వేల కోట్లు, ఎస్టీలకు రూ.17 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం బీసీలకు మాత్రం తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. తెలంగాణ సీఎం రాష్ట్రం లో బీసీలకు మేలు చేస్తామని కులగణన చేపట్టి బీసీ బిల్లు ప్రవేశ పెట్టిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఊసరవెల్లి మాటలతో జనాభా లెక్కల ప్రకారం సుమారుగా 56% ఉన్న బీసీలకు మరోసారి అన్యాయం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు అలాగే బీసీలకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అన్ని కుల సంఘాల నాయకులు ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత వాగ్దానాలు గ్రహిస్తున్నారని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కీ తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు



## మోత్కూరులో శ్రీకాంత్ చారి చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

వార్త మిర్రర్ మార్చ్ 19 చట్ట సభలలో బీసీ లకు 50% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీలను 27% నుంచి 42 % కల్పిస్తూ..అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తూ. .మంగళవారం నాడు మోత్కూరులో శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యం లో సీఎం.రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్వాత్రంత్రం 77 ఏళ్ళు దాటినా బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల విద్య, వైద్య, రాజకీయంగా తోపాటు అన్ని రంగాలలో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్ళ బీసీ సంఘాల పోరాటాల ఫలితంగా నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల ఆకాంక్ష”ను గుర్తించి ప్రసుతం బీసీలకు రాష్ట్రంలో ఉన్న 27% రిజర్వేషన్లలను 42 % వరకు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. అసెంబ్లీలో రిజర్వేషన్ల శాతాన్ని పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్లమెంట్ లో ఆమోదింప జేసేవిదంగా కృషి చేయాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, స్థానిక నాయకులు పోతరబోయిన నర్సయ్య, అంబటి విజయ్, మందుల సురేశ్, లాధినేని సోమేశ్వర్, కొత్తగట్టు సతీష్, పల్లపు సమ్మయ్య , యాదగిరి తదితరులు పాల్గొన్నారు.